క్లుప్తంగా

'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోండి

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి ఇల్లు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సోమవారం కోరారు. దరఖాస్తు ఫారాలను మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పథకానికి ఇల్లు లేని పేదలు అర్హులని, మహిళల పేరుపై దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆధార్, రేషన్, కులం, ఆదాయం, బ్యాంకు ఖాతా జిరాక్స్, రెండు ఫొటోలతోపాటు ఇంటి స్థలం వివరాలను దరఖాస్తుఫారంతో జత చేసి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

సాగునీటిని వృథా చేయొద్దు

అయిజ: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి అధికారులు నీటిని విడుదల చేశారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. సాగునీటి విడుదలతో మిరప నాట్లు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. నీటిని వృథా చేసే రైతుల పంట పొలాలకు సాగునీటి సరఫరాను నిలిపివేయాలని రైతు సంఘం కమిటీ తీర్మానించిందని పేర్కొన్నారు. పంట పొలాల అన్నింటికీ సాగునీరు అందేందుకు అందరూ సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటిస్తాం



అయిజ: మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేస్తామని, అందరూ సహకరించాలని తహసీల్దార్ షహదాబేగం అన్నారు. మంగళవారం వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంటల పరిశీలన

అలంపూర్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పూర్, ఇమాంపూర్ గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏఓ అనిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పూతదశకు వచ్చిన తర్వాత కలియదున్నాలని రైతులకు సూచించారు. పచ్చిరొట్టతో భూమి సారవంతం అవుతుందన్నారు. ఎకరా భూమిలో పచ్చిరొట్టను కలియదున్నడం వల్ల ఒక బ్యాగు యూరియా, 20కిలోల డీఏపీ ఆదా అవుతుందని తెలిపారు. పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు.

పనుల్లో వేగం పెంచాలి



రాజోలి: మండలంలోని పెద్దతాండ్రపాడు పాఠశాలలో చేపట్టిన పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గోవిందరావు అధికారులకు సూచించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గట్టు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మాచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మాచర్ల–చింతలకుంట దారిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కొద్ది దూరంలో ద్విచక్ర వాహనం ముందు చక్రం ఊడిపోయి నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. ఆ దారిలో వెళ్తున్న వారు చూసి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి కర్ణాటక ప్రాంతానికి చెందినట్లు మాచర్ల గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా గంధోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని రాజ వీధిలోని మసీదులో ప్రతిష్ఠించిన కొడిపీర్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఇమామేమౌలాలి గంధోత్సవాన్ని గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి రాత్రి ఒంటి గంటకు పట్టణంలోని పుర వీధుల గుండా పీర్లను ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి, అలాగే గురువారం సాయంత్రం హసనే ఆలం, హుసేనీఆలం, ఇమామేఖాసీం, ఇమామే జలాలీ పీర్లను భక్తులు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహిస్తారు. కొడిపీర్ల ఊరేగింపు చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కొడిపీర్ల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీపీఎస్ విధానంతో నష్టం

- ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
- 12న హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ
- ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలి
- సీపీఎస్‌ఈయూ నాయకుల పిలుపు



గద్వాలలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

గద్వాల అర్బన్: సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్‌ఈయూ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బుచ్చన్న తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఛలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఐక్యంగా ఉద్యమించి ఓపీఎస్‌ను సాధించుకుందామని పిలుపునిచ్చారు.

అలంపూర్: సీపీఎస్ విధానం రద్దు చేయాలని చేపట్టిన భారీ బహిరంగ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని ఓ పాఠశాలలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మురళి, అమరేందర్‌రెడ్డి, టీఎస్‌పీఆర్టీయూ నాయకులు లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, దిగేందర్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకుడు ఆంజనేయులు, టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ఈశ్వర్, వెంకటకృష్ణ, చెన్నారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, ఎంపీఓ ఖాజామొయిద్దీన్ ఉన్నారు.

అయిజ: ఈనెల 12న చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయం, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్‌రెడ్డి, కర్రెప్ప, పరుశురాముడు, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, ఏఈ గోపాల్, మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

గట్టు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు రాజుసాగర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. సీపీఎస్‌తో ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత లేకుండా పోతోందని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరుశరాముడు, నర్సింహగౌడ్, తిరుమల్లేష్, విక్రమసింహాచారి, తేజ తదితరులు పాల్గొన్నారు.



అయిజలో..



అలంపూర్ చౌరస్తాలో..



గట్టులో సమావేశమైన ఉపాధ్యాయులు

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం మల్దకల్ మండలం గార్లపాడుకు చెందిన పలువురు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం అడవిరావుల్‌చెర్వుకు చెందిన రైతు నర్సింహులు కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల రైతుబీమా చెక్కును అందజేశారు. పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కాగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై గద్వాల ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, చక్రంరెడ్డి, అజయ్, యాకోబు పాల్గొన్నారు.

పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ఎత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

మానవపాడు: పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని కొర్విపాడులో మంగళవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంట పూత దశలో ఉందని, పిందె రాలకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి అక్కడక్కడ ఎర్ర తెగులు ఆశించినట్లు గుర్తించామని, నివారణకు రైతులు ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వానాకాలంలో సాగు చేసిన పంటల వివరాలను రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాజామోహన్, చిన్న బలరాముడు, మద్రెన్న, బీచుపల్లి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

మల్దకల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని మల్దకల్ సబ్ పోస్ట్‌మాస్టర్ సుధాకర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పోస్టల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా అవసరమైన వారు పోస్టాఫీస్‌లో రూ.25 చెల్లిస్తే అందజేస్తామని తెలిపారు. అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది కిష్టన్న, రాధాకృష్ణ, సుధాకర్, లక్ష్మి, శారద, కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నగేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



జల్లాపురంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఉండవెల్లి/మానవపాడు: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తపస్ రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు మానవపాడు మండలం జల్లాపూర్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు ఉపాధ్యాయులను జాగృతం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వసంత్‌కుమార్, మురళీధర్, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మానవపాడు: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, ఎంపీడీఓ రమణారావు అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొర్విపాడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలను పాఠశాలలకు పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా బాలలను పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

ఎర్రవల్లిచౌరస్తా: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.5వేల నుంచి రూ.7వేలకు పెంచుతామన్నారు. అర్హులందరికీ రూ.4వేల పింఛన్ అందజేస్తామన్నారు. రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నాయకులకు సూచించారు. కాగా జూరాల కుడి కాలువకు సకాలంలో నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్ల మోజులో పడి ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం పక్కన పెట్టారన్నారని మండిపడ్డారు. అంతకుముందు ప్రజానాయకుడు గద్దర్ మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల రవి, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాగశిరోమణి, నాగరాజు, షేక్షావలిఆచారి, దేవేంద్ర ఉన్నారు.

భగవద్గీతపై ప్రచారం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పెద్దదిన్నెలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి ఎర్రవల్లి కమిటీ సభ్యులు ఇటింటికీ తిరిగి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో బీచుపల్లి, వెంకటేష్, పరుశరాముడు, వంశీ, మహేంద్ర, భాస్కర్‌రెడ్డి, పావని, భాగ్యమ్మ, స్వాతి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి టెలీకాన్ఫరెన్స్

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో మంత్రి హరీష్‌రావు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చిన్నారులకు టీకాలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూణరాణి, ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్‌ఏ బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

నియామకం

గద్వాల అర్బన్: జిల్లా పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంబీ ఒలివ చర్చిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటిసారిగా రెవరెండ్ వసంత్ కుమార్‌ను బిషప్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కృపాకర్, ప్రధాన కార్యదర్శి సుదర్శన అబ్రహం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్పీని ఆదరించండి



శాంతినగర్: బహుజనుల కోసం ఏర్పాటైన బీఎస్పీని అందరూ ఆదరించాలని పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవిచందర్ కోరారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు మృతి

శాంతినగర్: మండలంలోని రామాపురం గ్రామపంచాయతీ కార్మికుడు హెచ్.రామాంజనేయులు (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. నెలరోజులుగా నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న రామాంజనేయులు.. మధ్యాహ్నం గ్రామానికి తిరిగొచ్చాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామంలో ఓ రైతు పొలంలో కూలీ పనులకు వెళ్లగా, గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కార్మికుడికి భార్యతోపాటు నలుగురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బీసన్నగౌడ్, కిట్టు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని భరోసా ఇచ్చారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

కేటీదొడ్డి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జెడ్పీటీసీ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. చాలా గ్రామాల్లో పింఛన్ల సమస్య ఉందని, పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. బీసీబంధుకు మండలం నుంచి తక్కువ దరఖాస్తులు వచ్చాయని, రెవెన్యూ అధికారులు సకాలంలో ఆదాయ, కుల సర్టిఫికెట్లను జారీ చేయకపోవడంతోనే దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. చింతలకుంటకు మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా రావడం లేదని, సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఉమిత్యాల పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ సత్యన్న కోరారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్, డీటీ శివశంకర్, ఏఓ మహాలక్ష్మి,, సర్పంచులు సువర్ణమ్మ, తిక్కన్న, గోపాల్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. వడ్డేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ, వార్డుస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని తెలిపారు. ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ హన్మిరెడ్డి మాట్లాడుతూ బాలల హక్కులు, వారి విద్యకు ఎలాంటి భంగం కలిగించరాదన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, ఎంఈఓ నర్సింహులు, ఎంపీఓ తిరుపతన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, డీసీపీఓ నర్సింహ, బాలరక్షా భవన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి



అలంపూర్‌లో పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసూణరాణి



మానవపాడు పీహెచ్‌సీలో..

అలంపూర్ రూరల్: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని మండల వైద్యాధికారిణి ప్రసూణరాణి సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్యాతూర్ పీహెచ్‌సీలో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఇద్దరిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశామని, మరో ఏడుగురి నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

మానవపాడు: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ రిజ్వానా తస్వీర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెద్దపోతులపాడు, జల్లాపురం గ్రామాల మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, జయమ్మ, శారద, సోని, పరిమళ, సంధ్య, రషీద్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

గద్వాల అర్బన్: దాదాపు 20ఏళ్లుగా ప్రభుత్వాస్పత్రిలో సెకండ్ ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్నామని, ఎలాంటి రాత పరీక్ష లేకుండా తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. తాము విధుల్లో చేరినప్పటి నుంచి కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగుతున్నామని, తమను రెగ్యులరైజ్ చేయాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పారని, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని చేసి.. ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను వీడాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. ఈనెల 9, 10 తేదీల్లో చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సురేష్, వీవీ నర్సింహ, మన్యం, హరి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



వెంకటాపురంలో టీకాలు వేస్తున్న సిబ్బంది

గద్వాల వ్యవసాయం: పశువుల ఆరోగ్య సంరక్షణకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శంకరయ్య కోరారు. మండలంలోని శెట్టిఆత్మకూర్, చెనుగోనిపల్లి గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. మొత్తం 230 ఆవులు, ఎద్దులు, 240 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాధవీలత, ఉమాదేవి, శశికుమార్, రాముడు, కృష్ణయ్య, ప్రభాకర్, నర్సింహ, జహంగీర్, ఫణీంద్రరాజు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని వెంకటాపురం, కొత్తపల్లి గ్రామాల్లో 90 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల, జిల్లెడుదిన్నె గ్రామాల్లో 36మంది రైతులకు చెందిన 184 గేదెలు, 84 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు వీఎల్‌ఓ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది షేక్ లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్ పాల్గొన్నారు.